www.nagaranijam.com

PRGI/RNI NO : APTEL/2013/54450

# నగరనిజం

www.nagaranijam.com

అక్షరనిజం నగరనిజం

తెలుగు దిన పత్రిక

NNTV TELANGANA నగర నిజం

| సంపుటి : 14 | సంచిక : 41 | ఉమ్మడి రంగారెడ్డి | సంపాదకులు : ఏలె. పురుషోత్తం | 4, సోమవారం,మే 2026 | పేజీలు : 4+ | ₹ 3 |
|---|---|---|---|---|---|---|
| Volume : 14 | Issue : 41 | Rangareddy | Editor : Yela Purushotham | 4,Monday,May,2026 | Pages : 4+ | Price : 3/- |

Published From Rangareddy, Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad

నగరనిజం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను ఆసక్తి ఉన్నవారు ఈ క్రింది నెంబర్ ఫోన్‌కి చేయగలరు : ☎8247467562
Email Id : nagaranijam@gmail.com
Website : www.nagaranijam.com

## వనపర్తి పట్టణం లోని రోడ్డుకు అతి సమీపంలో విద్యుత్ ట్రాన్స్ ఫారం... ప్రమాద హెచ్చరిక



వనపర్తి జిల్లా:( నగర నిజం) 3 మే జిల్లా కేంద్రంలోని చందాపూర్ వెళ్లే రహదారి మార్గంలో రోడ్డుకు అతి సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ఫారం ప్రమాదకర పరిస్థితిని సృష్టిస్తోంది. ఈ మార్గంలో నిత్యం వాహనాలు, పాదచారులు పెద్ద సంఖ్యలో సంచరిస్తుండటంతో ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రోడ్డుకు అతి దగ్గరగా ఉండటంతో పెద్ద వాహనాలు వెళ్లేటప్పుడు ట్రాన్స్ఫారం తగిలే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో సరైన వెలుతురు లేకపోవడం వల్ల డ్రైవర్లు గమనించలేక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు చెబుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు ఈ మార్గంలో నడిచేటప్పుడు భయాందోళనకు గురవుతున్నారు.వర్షాకాలంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. నీరు నిలిచే సమయంలో విద్యుత్ షాక్ ప్రమాదం కూడా ఉండొచ్చని భయపడుతున్నారు. ఇప్పటివరకు ఎటువంటి ప్రమాదం జరగకపోయినా, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోతే పెద్ద ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని హెచ్చరిస్తున్నారు.ఈ సమస్యపై సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ట్రాన్స్ఫారం ఎత్తు పెంచడం, రోడ్డుకు దూరంగా మార్చడం లేదా రక్షణ గోడ ఏర్పాటు చేయడం వంటి చర్యలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## రాచమల్ల పెంటమ్మ జ్ఞాపకార్థం మొక్కను నాటిన ఆర్ఎస్పీ

**శంషాబాద్ లోని తొండుపల్లి వద్ద బీఆర్ఎస్ నేత రాచమల్ల జయసింహ ఇంటి వద్ద స్వేరో రూపాంతర్**

**స్వేరో రూపాంతర్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**

**పరామర్శల పేరుతో మద్యానికి బానిస కావద్దని ఆర్ఎస్పీ దిశా నిర్దేశం**







రాజేంద్రనగర్, మే 3 (నగరనిజం ప్రతినిధి) ఇంట్లో ఎవరైనా చనిపోతే ఆ బాధలో ఉన్నవారు చనిపోయిన వారి పేరుతో ఒక మొక్కను నాటాలని మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఇంట్లో ఎవరైనా చనిపోతే పరామర్శల పేరుతో మద్యం తాగడం, విందులో వినోదాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆయన హితవు పలికారు. గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ శంషాబాద్ పరిధిలోని తొండుపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాచమల్ల జయసింహ తల్లి రాచమల్ల పెంటమ్మ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం రాచమల్ల జయసింహ ఇంటి వద్ద స్వేరో ఆధ్వర్యంలో స్వేరో రూపాంతర్ (స్వేరో పలకరింపు) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్.... పెంటమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పెంటమ్మ కుటుంబ సభ్యులతో కలిసి వారి ఇంటి ఆవరణలో పెంటమ్మ జ్ఞాపకార్థం ఒక మొక్కను నాటి నీళ్లు పోశారు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్. ఈ సందర్భంగా మాట్లాడిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్..... రాచమల్ల జయసింహ లాంటి కుమారులను కన్న పెంటమ్మ జీవితం ధన్యమైంది అన్నారు. పెంటమ్మ భౌతికంగా మన నుండి దూరమైనప్పటికీ ఆమె జ్ఞాపకాలు పదిలంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. చాలాచోట్ల ఇంట్లో ఎవరైనా చనిపోతే బాధలో ఉన్నవారికి మద్యం తాగించడం, ఇందులో వినోదాలు చేయించడం స్వేరో సంస్కృతికి విరుద్ధమన్నారు. అప్పులు చేసి విందులో వినోదాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హితవు పలికారు. కులాలు, మతాలకు అతీతంగా చనిపోయిన వారి ఇంటికి వెళ్లి స్వేరో రూపాంతర్ నిర్వహించడం అలవాటు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. చనిపోయిన వారి పేరు మీద ఒక మొక్కను నాటాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. చనిపోయిన వారి పేరు మీద మొక్కను నాటితే అది పెరిగి పెద్దదై నలుగురికి నీడనిస్తుంది, తినడానికి ఫలాలను ఇస్తుందని ఆర్ఎస్పీ గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రాచమల్ల జయసింహ తో పాటు వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

**పెంటమ్మ పేరుతో మొక్కను నాటిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**

దివంగత రాచమల్ల పెంటమ్మ జ్ఞాపకార్థం వారి ఇంటి ఆవరణలో రాచమల్ల జయసింహ కుటుంబ సభ్యులతో కలిసి ఒక మొక్కను నాటి నీళ్లు పోశారు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్. పెంటమ్మ కుటుంబం లోని ప్రతి ఒక్కరూ ఈ మొక్కను పెంచి పోషించాలని సో ఆయన సూచించారు. అనంతరం రాచమల్ల జయసింహతో పాటు వారి కుటుంబ సభ్యులకు స్వేరో ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్.ఈ కార్యక్రమంలో రాచమల్ల జయసింహ తో పాటు గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ శంషాబాద్ 118 డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొలను ప్రదీప్ రెడ్డి, కొత్వాల్ గూడ 119 డివిజన్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్, పార్టీ ప్రధాన కార్యదర్శి చిన్నగండు రాజేందర్, ఎమ్మార్పీఎస్ నేతలు చిన్నగండు భాస్కర్, ఊటు జోసెఫ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



## భూషణం మరణం ఆకుటుంబానికి తీరనిలోటు

మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డీ



మహేశ్వరం మే 03 (నగరనిజం) :మహేశ్వరం గ్రామ మాజీ వార్డు సభ్యులు సీనియర్ నాయకులు "కీర్తిశేషులు" పెయ్యల భూషణం అనారోగ్య కారణాలవల్ల నగరంలో అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి, మహేశ్వరం శాసనసభ్యురాలు పి.సబితా ఇంద్రారెడ్డి మహేశ్వరం గ్రామం చేరుకొని భూషణం సమాధి వద్ద ఘన నివాళులు అర్పించారు వారి కుటుంబ సభ్యులను ఓదార్చుతూ భూషణం లేని లోటు ఎవ్వరు తీర్చలేనిదని వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కర్రోళ్ల చంద్రయ్య, మాజీ సర్పంచ్ స్వర్ణగంటి ఆనందం, మాజీ కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ ఆదిల్ అలీ, కాడమోని ప్రభాకర్, వార్డు సభ్యులు స్వర్ణగంటి సంజీవ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మల్కారం వద్ద ఒరిస్సా మహిళ ఆత్మహత్య


**శంషాబాద్ (మం) మల్కారం వద్ద కొత్త యాదగిరి రెడ్డి గోదాం వద్ద ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డ మహిళ**

**మృతురాలు ఒడిస్సా రాష్ట్రానికి చెందిన దీపాంజలి గా గుర్తించిన పోలీసులు**

**దీపాంజలి ఆత్మహత్యకు భర్త చందన్ కుమార్ ప్రధాన్ వరకట్నం వేధింపులే కారణమన్న కుటుంబ సభ్యులు**

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న శంషాబాద్ పోలీసులు**




రాజేంద్రనగర్, మే 3 (నగరనిజం ప్రతినిధి): రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం లోని మల్కారం వద్ద విషాదం చోటుచేసుకుంది. బతుకుదెరువు కోసం ఒరిస్సా నుండి వలస వచ్చిన ఓ మహిళ భర్త పెట్టి వరకట్నం వేధింపులు భరించలేక బలవన్మరణానికి పాల్పడింది. మృతురాలు ఒరిస్సా రాష్ట్రానికి చెందిన దీపాంజలి ప్రధాన్ (26) గా పోలీసులు గుర్తించారు. భర్త చందన్ కుమార్ ప్రధాన్ పెట్టే వరకట్నపు వేధింపులు భరించలేకనే తమ కూతురు ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శంషాబాద్ ఇన్స్పెక్టర్ నరేందర్ రెడ్డి కథనం ప్రకారం ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒరిస్సా రాష్ట్రం బాల సూరి జిల్లాలోని సుల్తాన్ పూర్ ప్రాంతానికి చెందిన దీపాంజలి ప్రధాన్, చందన్ కుమార్ ప్రధాన్ అనే దంపతులు గత కొంతకాలం క్రితం బతుకుదెరువు కోసం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం లోని మల్కారం ప్రాంతానికి వలస వచ్చారు. ఈ మేరకు కొత్త యాదగిరి రెడ్డి అనే రైతుకు చెందిన గోదాం లో పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. అయితే ఏం జరిగిందో ఏమో తెలియదు గానీ ఆదివారం నాడు తమ గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయం తెలుసుకున్న గోదాం యజమాని కొత్త యాదగిరి రెడ్డి వెంటనే ఈ విషయాన్ని శంషాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న శంషాబాద్ పోలీసులు.... మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అయితే తమ కూతురు ఆత్మహత్యకు భర్త చందన్ కుమార్ ప్రధాన్ వేధింపులే కారణమని ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో కూడా వరకట్నం కోసం చందన్ కుమార్ ప్రధాన్ తమ కూతురిని వేధించాడని వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత కొన్ని రోజులుగా వరకట్నం కోసం మళ్లీ వేధింపులు మొదలుపెట్టాడని, అందువల్ల వేధింపులు భరించలేక తమ కూతురు ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేందర్ రెడ్డి ప్రకటించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించినట్లు ఆయన వెల్లడించారు.

# వనస్థలిపురంలో రంగారెడ్డి జిల్లా బీసీ సంఘం కార్యాలయం ఘనంగా ప్రారంభోత్సవం

**ముఖ్యఅతిథిగా: డా. ర్యాగ అరుణ్ కుమార్**

**బాణాల అజయ్ కుమార్ ఆధ్వర్యంలో**





ఎల్బీనగర్, మే 3 (నగర నిజం): వనస్థలిపురంలో బీసీ సంఘాల కార్యకలాపాలకు కొత్త దిశనిచ్చేలా రంగారెడ్డి జిల్లా బీసీ సంఘం కార్యాలయం ప్రారంభమైంది. ఈ సందర్భంగా "బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ నేషనల్ జనరల్ సెక్రటరీ బాణాల అజయ్ కుమార్" ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి "నేషనల్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ డా. ర్యాగ అరుణ్ కుమార్" ముఖ్య అతిథిగా హాజరై కార్యాలయాన్ని ప్రారంభించారు. డా. "ర్యాగ అరుణ్ కుమార్" మాట్లాడుతూ, జనాభాలో అధిక శాతం బీసీలు ఉన్నప్పటికీ రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో సరైన ప్రాతినిధ్యం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు కాకపోవడం వల్ల బీసీ వర్గాల్లో అసంతృప్తి పెరుగుతోందని పేర్కొన్నారు. 50 శాతం రిజర్వేషన్ అంశంపై ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీల హక్కుల సాధన కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రిజర్వేషన్ అమలు చేయకపోతే ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వెయ్యి మందితో భారీ ధర్నా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే ఈ ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా విస్తరించి కేంద్ర ప్రభుత్వంపై కూడా ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు. "బాణాల అజయ్ కుమార్" కాంగ్రెస్ ప్రభుత్వశీ పార్లమెంట్‌లో బీసీ ప్రైవేట్ బిల్ ప్రవేశపెట్టి 50 శాతం రిజర్వేషన్ సాధించేందుకు కృషి చేస్తామని ఆయన వెల్లడించారు. రాజ్యాంగ పరంగా బీసీలకు న్యాయం జరిగేలా చట్టపరమైన మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ సంఘం నాయకులు మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలు, అసెంబ్లీ, పార్లమెంట్ స్థాయిల్లో బీసీలకు తగిన అవకాశాలు కల్పించాలని కోరారు. బీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను సమర్థంగా అమలు చేయాలని, ఉపాధి అవకాశాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాణాల రెస్రిత్ (బిబిఏ, ఎల్ఎల్బి) బీ.సీ నేషనల్ స్టూడెంట్ వర్కింగ్ ప్రెసిడెంట్ బీసీ స్టూడెంట్ అసోసియేషన్, అరవింద్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, దుగుంట్ల శ్రీధర్ రాష్ట్ర కన్వీనర్, బీసీ అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, రఘుపతి అడుల బీసీ రాష్ట్ర కార్యదర్శి, భీమ్ రాజ్, బీసీ రాష్ట్ర కార్యదర్శి, ఆకాష్ కదారి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి, కె. రవి మల్కాజిగిరి జిల్లా జనరల్ సెక్రటరీ, తదితర నాయకులు యువ నాయకులు పాల్గొన్నారు.





# తాండూర్ టౌన్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కౌన్సిలర్ ఇర్షాద్



నగర నిజం తాండూర్ ప్రతినిధి మే 3 :వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలో పేద ప్రజల కోసం ప్రభుత్వం నిర్మించిన 200 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ విషయంలో జరుగుతున్న పరిణామాలు అత్యంత ఆందోళనకరంగా ఉన్నాయని మున్సిపల్ కౌన్సిలర్ ఒక ప్రకటనలో అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.ప్రజల ఓట్లతో ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులైన కౌన్సిలర్లను పూర్తిగా పక్కనపెట్టి, జీఎంకే ట్రస్ట్ వంటి ప్రైవేట్ సంస్థ ద్వారా ఇళ్లను పంచడం ప్రజాస్వామ్య వ్యవస్థకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్న తీరుపై ఆందోళన కలిగిస్తున్న విషయమని అన్నారు.ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత, సమానత్వం ఉండాలి. కానీ ఇక్కడ జరుగుతున్న విధానం ప్రజలలో అనుమానాలు రేకెత్తిస్తోంది. ఇది పేదల హక్కులను దూరం చేసే ప్రమాదకర ధోరణిలా ఉందని విమర్శిస్తున్నారు.ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ప్రతి సమావేశంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తామని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ విషయంలో కూడా కూడా న్యాయంగా నిరుపేదలైన ప్రజలకే ఇవ్వడం జరుగుతుందని చెప్పిన సందర్భాలు చాలా ఉన్నాయి.ఈ నేపథ్యంలో జరిగిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ జీఎంకే ట్రస్ట్ వంటి ప్రైవేట్ సంస్థ ద్వారా ఇళ్లను పంచడం వంటి చర్యలు ఆ మాటలకు విరుద్ధంగా కనిపిస్తున్నాయి.కాబట్టి, ఈ వ్యవహారంపై తక్షణమే స్పష్టత ఇవ్వాలి. ఇళ్ల పంపిణీ పూర్తిగా ప్రజాప్రతినిధుల సమక్షంలో, పారదర్శకంగా జరగాలి. లేకపోతే,ఈ అంశంపై ప్రజలతో కలిసి ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

# వ్యవసాయ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి

**రేపటినుండి డివిజన్ స్థాయిలలో ప్రజావాణి నిర్వహణపై సమగ్ర ప్రణాళిక ద్వారా చర్యలు**

**జిల్లాలో పటిష్టంగా జన గణన చేపట్టాలి.**

**మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్.**



మెదక్,3. మే,2026వ్యవసాయ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని లిప్రజల సమస్యల సత్వర పరిష్కారమే దిశగా రేపటి నుండి డివిజన్ స్థాయి ప్రజావాణి నిర్వహించే విధంగా చర్యలు తీసుకున్నట్టు, జనగణన సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వ్యవసాయ వారోత్సవం, డివిజన్ సాయి ప్రజావాణి ప్రజావాణి, జనగణన నిర్వహణ ఈ అంశాలపై అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా అధికారులు,వ్యవసాయ అధికారులు, ఆర్డీవోలతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జనగణన సమర్థవంతంగా నిర్వహించాలని రేపటినుండి నిర్వహించే వ్యవసాయ వారోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.. ప్రతిరోజు షెడ్యూల్ వారీగా వ్యవసాయ అధికారులు సమగ్ర కార్యాచరణ ద్వారా ముందుకు పోవాలన్నారు. జన గణనకు సంబంధించి సమర్థ నిర్వహణకు తగు సూచనలు సలహాలు అందించారు.డివిజనల్ స్థాయి ప్రజావాణిపై ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన "ప్రజావాణి" కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రజల సమస్యల సత్వర పరిష్కరమే రేపటినుండి డివిజన్ స్థాయి ప్రజావాణిలి ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడమైనదని అని అన్నారు.ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రతి సోమవారం జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రజావాణి నిర్వహించడం జరుగు తుందన్నది అందరికీ తెలిసిన విషయమైనప్పటికి రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఆర్‌డీవో కార్యాలయాలలో కూడా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుందని కలెక్టర్ అన్నారు.అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు జిల్లా స్థాయిలో. డివిజన్ స్థాయి అధికారులు డివిజన్ స్థాయిలో జరిగే ప్రజావాణికి తప్పనిసరిగా హాజరై, ప్రజల వినతులను స్వీకరించి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజల ఫిర్యాదులను ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేసి, ప్రతి వినతికి ప్రత్యేక ధృవీకరణ నంబర్ కేటాయించ బడుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.అందిన ఫిర్యాదులను 30 రోజులలోపు పరిష్కరించి, తీసుకున్న చర్యల నివేదికలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.ప్రజలు తమ ఫిర్యాదుల స్థితిని ఆన్‌లైన్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉంటుందని వారు పేర్కొన్నారు.జిల్లా కలెక్టరేట్ మరియు రెవెన్యూ డివిజన్ కార్యాలయాలలో డివిజన్ స్థాయిలో ప్రత్యేక ప్రజావాణి విభాగాలు ఏర్పాటు చేయాలని, అధికారులు ప్రజల పట్ల నిబద్ధత తో వ్యవహరించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

# శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల 617వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ -కళ్యాణి భవ్యసాయి పాల్గొనడం విశేషం





కుత్బుల్లాపూర్, మే 3 (నగర నిజం ప్రతినిధి):కళల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తున్న శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల 617వ జయంతి ఉత్సవాలు మరియు వరల్డ్ డ్యాన్స్ డే వేడుకలు హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ కూచిపూడి నృత్య గురువు, ప్రిన్సిపల్ కళ్యాణి భవ్య సాయి గౌరవ అతిథిగా పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఈ సందర్భంగా మాట్లాడిన కళ్యాణి భవ్య సాయి, కూచిపూడి నృత్యం భారతీయ సాంప్రదాయానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కళను నేర్చుకోవడం ద్వారా భారతీయ సంస్కృతిని కాపాడగలరని తెలిపారు. భవిష్యత్ తరాలకు సంప్రదాయ విలువలను అందించేందుకు తమ సంస్థ నిరంతరం కృషి చేస్తోందని వివరించారు.కార్యక్రమంలో కళ్యాణి భవ్య సాయి శిష్యుల్లో పదిమంది విద్యార్థులు అద్భుతమైన నృత్య ప్రదర్శనలు అందించారు. ముఖ్యంగా "గోదా దేవి వచ్చెనమ్మ" నృత్యం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోగా, ఇతర ప్రదర్శనలు కూడా హర్షధ్వానాలు పొందాయి.ఈ సందర్భంగా శిఖరం ఆర్ట్ థియేటర్స్ తరఫున ప్రతిభ కనబరిచిన శిష్యులకు ప్రతిష్టాత్మకమైన గోల్డ్ నటరాజ స్వామి అవార్డు ప్రదానం చేయడం విశేషంగా నిలిచింది.తమ కుటుంబ వారసత్వంగా కళలను ముందుకు తీసుకువెళ్తున్నామని కళ్యాణి భవ్య సాయి తెలిపారు. తమ తండ్రి టి.ఎస్. ప్రతాప్ మాస్టర్ ఈ సంస్థ స్థాపకుడని, గత 47 సంవత్సరాలుగా కళారంగానికి సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం సంస్థకు మూడు శాఖలు ఉండగా, వనస్థలిపురం శాఖలో కూడా శిక్షణ విజయవంతంగా కొనసాగుతోందని వెల్లడించారు.

# ప్రశాంత వాతావరణంలో నీట్ పరీక్షలు

**నీట్ పరీక్ష రాయాల్సిన అభ్యర్థులు 479**

**465 పరీక్షలకు హాజరు, 14 మంది గైర్హాజరు.**

**పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్డీవో రమాదేవి.**



మెదక్ బ్యూరో :నగర నిజం: 03 మే, 2026జిల్లాలో నిర్వహించిన నీట్ పరీక్ష ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో జరిగిందని అదనపు కలెక్టర్ నగేష్ , మెదక్ ఆర్డీవో రమాదేవి తెలిపారుఆదివారం జిల్లాలో నీట్ పరీక్ష జరుగుతున్న మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, నీట్ పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ పరిశీలించారు,ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు బయోమెట్రిక్ వినియోగించిన విధానాన్ని పరిశీలించి...అలాగే పరీక్షలకు ఎంతమంది విద్యార్థులు హాజరు అయ్యారు ,గైర్హాజరు శాతం వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారుఈ పరీక్షకు మొత్తం 479 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 465 హాజరయ్యారని, 14 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు.పరీక్షలు పూర్తి అయ్యేంతవరకు విద్యార్థులకు ఎటువంటి అంతరాయం, సమస్యలు ఉత్పన్నం కలుగకుండా ఇన్విజిలేటర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలని తెలిపారు . పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాల నిఘాతోపాటు గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు.పరీక్ష పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగినట్లు తెలిపారునిబంధనలకు విరుద్ధంగా ఇతరులను పరీక్షా కేంద్రాలలోకి అనుమతించకూడదని స్పష్టం చేశారు.మెదక్ ఆర్డీవో రమాదేవి నీట్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేశామన్నారు .ఆర్డీవో వెంట తాసిల్దార్ లక్ష్మణ్ బాబు నీట్ పరీక్ష కేంద్ర నిర్వాహకులు ఇతర పోలీసు అధికారులు, నీట్ , ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాద బాధితులనుబ్ పరామర్శించిన భీరం విజయమ్మ



కొల్లాపూర్ మే 3 ( నగరనిజం ప్రతినిధిబ్ ఎర్రం నాగేంద్రం)పాన్ గల్ మండలం జమ్మాపూర్ గ్రామంలో ఇటీవల ప్రమాధానికి గురై చికిత్స పొందుతున్న బోయిని భాస్కర్ గారిని పరామర్శించి మానసిక ధైర్యంన్ చెప్పిన మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి సతీమణి భీరం విజయమ్మ. ఈకార్యక్రమంలో బి ఆర్ ఎస్ జిల్లా నాయకులు జ్యోతినందన్ రెడ్డి , మాజీ ఎంపీపీ ఎం. శ్రీధర్ రెడ్డి, మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు వెంకటయ్య నాయుడు, మాజీ సర్పంచ్ బోయిని చెన్నమ్మ నాగరాజు, ప్రొఫెసర్ డా ఎం ఎర్రం నాగేంద్రం, తాజా వార్డు సభ్యులు, ఉపసర్పంచ్ శివనీలశేఖర్, శ్రీధర్, నాగరాజు, లక్ష్మీ, మల్లెపు రాజు, గుజ్జలక్ష్మీ, కురుమయ్య, పార్టీ అధ్యక్షులు ఎస్ నిరంజన్ రెడ్డి, ప్రవీణ్, లాల పాషా ,హుస్సేన్, టైలర్ రాజు, కురుమెందర్, కె అర్జున్, ఎర్రం బాబు, ఎర్రం సిద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పట్టుచీర కార్యక్రమంలో పాల్గొన్న భీరం విజయమ్మ



కొల్లాపూర్ మే 3 (నగరనిజం ప్రతినిధి ఎర్రం నాగేంద్రం)పాన్ గల్ మండలం జమ్మాపూర్ గ్రామంలో బాలరాజు – స్వప్న కూతురు పట్టుచీర కార్యక్రమంలో పాల్గొన్న భీరం విజయమ్మ. ఈ సందర్భంగా చిన్నారులను ఆశీర్వదించారు. మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి సతీమణి భీరం విజయమ్మ. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు జ్యోతినందన్ రెడ్డి , మాజీ ఎంపీపీ ఎం.శ్రీధర్ రెడ్డి, మాజీ రైతుసమన్వయ సమితి అధ్యక్షులు వెంకటయ్య నాయుడు, మాజీ సర్పంచ్ బోయిని చెన్నమ్మ నాగరాజు, ప్రొఫెసర్ డా ఎర్రం నాగేంద్రం, తాజా వార్డు సభ్యులు, ఉపసర్పంచ్ శివనీలశేఖర్, శ్రీధర్, నాగరాజు, లక్ష్మీ, మల్లెపు రాజు, గుజ్జలక్ష్మీ, కురుమయ్య, పార్టీ అధ్యక్షులు ఎస్ నిరంజన్ రెడ్డి, ప్రవీణ్, లాల పాషా ,హుస్సేన్, టైలర్ రాజు, కురుమెందర్, కె అర్జున్, ఎర్రం ఈ రాములు ఎర్రం బాబు, ఎర్రం సిద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బాల హక్కుల దర్శిని
## రక్షా బాట పర్యటన ముగింపు కార్యక్రమం




మెదక్, 4 మే (నగర నిజం) : మెదక్ జిల్లా పరిపాలన విభాగం ఆధ్వర్యంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కలిసి నిర్వహించిన "బాల హక్కుల దర్శిని -- రక్షా బాట" అవగాహన పర్యటన విజయవంతంగా ముగిసింది. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన 99 రోజుల కార్యక్రమంలో ఈ పర్యటన కీలకంగా నిలిచింది.వారం రోజుల పాటు సాగిన ఈ పర్యటనలో బాలల హక్కులు, భద్రత, ఆరోగ్యం, సంరక్షణ అంశాలపై ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించారు. చిన్నారులపై జరుగుతున్న సమస్యలు, వాటి నివారణ చర్యలు, ప్రభుత్వ సేవల వినియోగంపై వివరించారు. గుడ్ టచ్--బ్యాడ్ టచ్, సైబర్ భద్రత, మత్తు పదార్థాల నివారణ వంటి అంశాలపై ప్రత్యేక సందేశాలు అందించారు.పర్యటనలో విద్యార్థులు, తల్లిదండ్రులు, మహిళా సంఘాలు, ఆశా సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, స్థానిక సమాజ ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని అవగాహన పొందారు.ఈ సందర్భంగా "డ్రగ్స్‌కు నో– జీవితానికి యస్ అనే అవగాహన గీతాన్ని విడుదల చేశారు. ఇది యువతలో మత్తు పదార్థాలపై వ్యతిరేక భావన పెంపొందించేందుకు తోడ్పడనుంది.అధికారులు మాట్లాడుతూ చిన్నారుల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. సమాజంలోని ప్రతి వ్యక్తి ముందుకు వచ్చి బాలల భద్రత కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వంటి ప్రమాదాల నుంచి యువతను దూరంగా ఉంచేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు.

# తూప్రాన్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా మామిళ్ళ కృష్ణ ఎన్నిక

**నూతన పదవికి మామిళ్ళ కృష్ణకు హార్దిక శుభాకాంక్షలు**

**ప్రజా ప్రతినిధులు, సంఘాల నాయకుల అభినందనలు వెల్లువ**

**తూప్రాన్ ప్రజల ఆశలు నెరవేర్చాలని ఆకాంక్ష**



మెదక్ బ్యూరో: నగర నిజం :తూప్రాన్ మార్కెట్ కమిటీకి నూతనంగా వైస్ చైర్మన్‌గా ఎన్నికైన మామిళ్ళ కృష్ణకి ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు మరియు స్థానిక ప్రజలు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఎన్నికతో తూప్రాన్ ప్రాంత అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, మామిళ్ళ కృష్ణ గారు రైతుల సమస్యలను పరిష్కరించడంలో, మార్కెట్ వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుని సేవలందించాలని సూచించారు.

# ఎల్లమ్మబండ ఎన్టీఆర్ నగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

**పట్టించుకోని మున్సిపల్ అధికారులు.**

**తీవ్రమైన దుర్గంధంతో ఇళ్లలో ఉండలేమంటూ స్థానికుల ఆవేదన.**



కూకట్‌పల్లి, మే 03(నగర నిజం ప్రతినిధి) :సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ షంషీగూడ పరిధిలోని ఎల్లమ్మబండ ఎన్టీఆర్ నగర్ మజీద్ గల్లి లైన్ బ్లాక్ నెంబర్ 143 నివాస గృహాల మధ్య తీవ్రమైన దుర్గంధంతో ఇళ్లలో ముక్కుమూసుకొని ఉండాల్సిన దుస్థితి నెలకొందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. గత మూడు నెలలకు పైగా ఎల్లమ్మ బండ పరిసరాల్లో డ్రైనేజీ లీకేజీలు నిరంతరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే వార్డు, మున్సిపల్ కార్యాలయంలో ఒకటికి, రెండుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుల నిర్లక్ష్యం, సిబ్బంది నిర్వాకం శాపంగా మారిందని ఆ డివిజన్ ప్రజలు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. రోడ్లపై చెత్తంతా నెలల తరబడి పేరుకపోవడంతో గాలి వీచిన సమయంలో తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోందని, అప్పుడు ఇళ్లలో శ్వాస తీసుకోలేని పరిస్థితి ఉందని వాపోతున్నారు.మురికి నీరు కాలనీలో రోడ్లపైనే పొంగి పొర్లుతూ ఉండటం వలన దోమలు, పందులు,స్వైర విహారం చేయడం వల్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.ఈ దుర్గంధం కారణంగా చిన్నారులు, వృద్ధులు రోగాల బారిన పడుతున్నారని తీవ్రమైన ఆవేదన వ్యకం చేస్తున్నారు. చుట్టు పక్కల వారు సైతం రాత్రి వేళల్లో వచ్చి ఇక్కడి చెత్తను పడేసి వెళ్తున్నారని వాపోతున్నారు.ఈదురు గాలులకు చెత్తంతా ఇళ్లలోకి వస్తుండటం మరింత ఇబ్బందులకు గురి చేస్తుందని పేర్కొంటున్నారు. మున్సిపల్ సంబంధిత పారిశుధ్య విభాగం అధికారుల దృష్టికి తీసుకవెళ్లినా ప్రయోజనం ఉండటం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి,ఈ ప్రధాన సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇక్కడ సరైన డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవస్థ లేకపోవడం, తరచుగా డ్రైనేజీ లీకేజీలు, పూడిక తీయకపోవడం ప్రధాన సమస్యగా ఉంది. స్థానిక ప్రజలు జిహెచ్ఎంసి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ శాశ్వత పరిష్కారం లభించడం లేదని, వెంటనే డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.మున్సిపల్ అధికారలు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# నకిలీ విత్తనాలపై టాస్క్ ఫోర్స్ విస్తృత తనిఖీలు ప్రారంభం

**నకిలీ విత్తనాల విక్రేతలపై పీడీ యాక్ట్ కింద కఠిన చర్యలు.**

**"నకిలీ విత్తనాల రహిత జిల్లా"గా మెదక్ లక్ష్యం.**

**విత్తన కంపెనీలు, డీలర్లపై కఠిన నిబంధనలు.**

**వానాకాలం 2026కు ఎరువులు, పురుగుమందుల సమృద్ధి నిల్వలు**

**రైతులకు నాణ్యమైన విత్తనాల అందుబాటుపై ప్రత్యేక దృష్టి**

**జిల్లాలో బహుస్థాయి టాస్క్ ఫోర్స్ బృందాల ఏర్పాటు**

**పత్తి, వరి పంటల్లో నకిలీ విత్తనాలపై ప్రత్యేక నిఘా.: జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్**



మెదక్ బ్యూరో నగర నిజం : , మే 2, 2026మెదక్ జిల్లాను "నకిలీ విత్తనాల రహిత జిల్లా"గా తీర్చిదిద్దేందుకు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కఠిన చర్యలు ప్రారంభించారు. నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై పీడీ (గూణ) యాక్ట్ కింద కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు టాస్క్ ఫోర్స్ బృందాల ద్వారా జిల్లావ్యాప్తంగా విస్తృత తనిఖీలు ప్రారంభమయ్యాయి.కలెక్టరేట్ కార్యాలయంలో వానాకాలం 2026కు సంబంధించి విత్తనాలు, ఎరువుల సమన్వయంపై జరిగిన సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, ఆర్డీవోలు రమాదేవి, రామకృష్ణ, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ఎరువులు మరియు పురుగుమందుల కొరత లేకుండా ముందస్తుగా బఫర్ స్టాక్ సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుతం జిల్లా స్థాయి, డివిజనల్ స్థాయి, మండల స్థాయిలో టాస్క్ ఫోర్స్ బృందాలు పనిచేస్తున్నాయని తెలిపారు.ప్రస్తుతం జిల్లాలో 334 రిటైల్ విత్తన దుకాణాలు, 41 ప్రాసెసింగ్ యూనిట్లు, 334 లైసెన్సు కలిగిన విత్తన హోల్డర్లు ఉన్నారు. ముఖ్యంగా పత్తి, వరి పంటల్లో నకిలీ విత్తనాల సమస్య అధికంగా ఉండటంతో కఠిన తనిఖీలు చేపట్టాలని నిర్ణయించారు.వానాకాలం 2026లో సుమారు 3.26 లక్షల ఎకరాల్లో సాగు అంచనా ఉండగా, అందుకు తగిన విత్తనాల సరఫరా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువుల నిల్వలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు.రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని, లూజ్ విత్తనాలను కొనవద్దని సూచించారు. నకిలీ విత్తనాల నియంత్రణలో ఎలాంటి రాజీ ఉండదని, చట్టపరమైన చర్యలు కఠినంగా తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.



# ప్రైవేట్ వర్సిటీల కోసమే జీవో7

**బడుగులకు ఉన్నతవిద్య దూరంచేసే కుట్ర**

**బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆశ్వంత్ కుమార్ ధ్వజం**

**విద్యాభరోసా కార్డు తేవాలని డిమాండ్**



కూకట్‌పల్లి మే 03,(నగర నిజం ప్రతినిధి) :ప్రైవేట్ యూనివర్సిటీల లబ్ధి కోసమే రేవంత్రెడ్డి సర్కార్ జీవో 7ను తీసుకొచ్చిందని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆశ్వంత్ కుమార్ ఒక ప్రకటనలో ఆరోపించారు. యూనివర్సిటీ ల గుర్తింపుతో (అఫిలియేషన్తో) నడిచే కాలే జీలు మూతపడటమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నదని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనారిటీ వర్గాలతోపాటు దివ్యాంగులకు ఉన్నత విద్యను దూరం చేయాలని రేవంత్ సర్కార్‌కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. సర్కార్ వైఖ రితో ఉన్నత విద్యకు బడుగు వర్గాలు దూరమవుతా యని, ఉన్నత వర్గాలే ఉన్నత విద్యను అభ్యసిస్తాయని ధ్వజమెత్తారు. జీవో 7 ద్వారా డీబీటీ పద్ధతిలో ఏ నెలలో ఎంత శాతం ఫీజులు చెల్లిస్తారో స్పష్టత లేక విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ డీబీటీ విధానంలో విద్యార్థుల నుంచి ఫీజు వసూలు చేయవ ద్దని ప్రభుత్వ ఆదేశాలను కాలేజీ యాజ మాన్యాలు పాటించే పరిస్థితి ఉండదని తెలిపారు. కేవలం ఫీజులు చెల్లించిన విద్యార్థులకే అడ్మిషన్లు ఖరారు చేసే పరిస్థితి ఉంటుందని తెలిపారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసానికి దూరమవుతారని ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టిన 5 లక్షల విద్యాభరోసా కార్డు పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్‌లోకి ఎవ్వరూ చేరలేదు

**గ్రామ సర్పంచ్ సర్పంచ్ శ్రీవాణి హనుమంత్**

గజ్వేల్ మండలం, మే,2,(నగర నిజం): అక్కారంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉంది కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణ చూసి బిఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని అక్కారం గ్రామ సర్పంచ్ శ్రీవాణి హనుమంతు అన్నారు.ఆదివారం అక్కారం గ్రామంలో సర్పంచ్ శ్రీవాణి హనుమంతు మాట్లాడుతూ అక్కారం గ్రామం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణ చూసి కొందరు జీర్ణించుకోలేకపోవడం దురదృష్టమని, ఒక్క సింగర్ కాంగ్రెస్ పార్టీ నుంచి బిఆర్ఎస్ పార్టీలోకి పోవడం వల్ల కాంగ్రెస్ పార్టీకి నష్టం ఏమీ లేదని, కాంగ్రెస్ నుంచి బిఆర్ఎస్ పార్టీలోకి వలసలు వచ్చాయని అనడం అవివేకమని వారి పార్టీ వారికి కండువాలు కప్పి అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని, ప్రజలకు అన్ని విధాల సహకరిస్తున్న కాంగ్రెస్ పార్టీ, రాబోయే రోజుల్లో గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి,డీసీసీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో మండలంలోనే ఆదర్శవంత గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని అన్నారు. మాజీ సర్పంచ్, కొంతమంది బిఆర్ఎస్ నాయకులు ఇలాంటి అబద్ధపు ప్రచారాలను మానుకోవాలని అన్నారు.

నగరనిజం



# ఇంద్రేశంలో అక్రమ నిర్మాణాల జోరు

# కుర్చీలకే పరిమితమైన మున్సిపల్ అధికారులు

**జీ ప్లస్2 అనుమతులతో జీప్లస్5 కట్టడాలు..**
**కళ్లున్నా చూడని టౌన్ ప్లానింగ్ విభాగం**








నగర నిజం ప్రతినిధి విజయ్ కుమార్:సంగారెడ్డి జిల్లాలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఇంద్రేశం మున్సిపాలిటీ ఇప్పుడు అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారింది. నిబంధనలు గాలికి వదిలేసి, అనుమతులు లేని కట్టడాలు ఆకాశాన్ని తాకుతున్నా పట్టించుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది.క్షేత్రస్థాయిలో అక్రమాలు కళ్లకు కనిపిస్తున్నా, అధికారులు మాత్రం తమ ఏసీ గదులకే పరిమితమై ఫైళ్లకే మొగ్గు చూపుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.మున్సిపల్ చట్టాలు పకడ్బందీగా అమలు కావాల్సిన చోట అధికారుల ఉదాసీనత రియల్ మాఫియాకు వరంగా మారింది. ముఖ్యంగా నిబంధనల ఉల్లంఘన ఇక్కడ పరాకాష్టకు చేరింది. కేవలం రెండు అంతస్తుల (జీప్లస2) అనుమతులు పొంది, ఏకంగా ఐదు అంతస్తుల (జీ ప్లస్ 5) భారీ భవనాలను యథేచ్ఛగా నిర్మిస్తున్నారు. అనుమతికి, నిర్మాణానికి ఎక్కడా పొంతన లేకపోయినా, సంబంధిత అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూసే నాథుడే కరువయ్యారు.మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ చూసినా సెట్ బ్యాక్స్ లేని భవనాలు, ఎఫ్.ఎస్.ఐ నిబంధనల ఉల్లంఘనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నివాస ప్రాంతాల్లో వాణిజ్య సముదాయాలు వెలుస్తున్నా, రోడ్లను ఆక్రమించి ప్రహరీ గోడలు కడుతున్నా పర్యవేక్షించాల్సిన యంత్రాంగం నిద్రలో మునిగిపోయింది. అక్రమ నిర్మాణాలపై స్థానికులు రాతపూర్వక ఫిర్యాదులు చేసినా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతోంది. కేవలం ఫిర్యాదులు వచ్చినప్పుడు మొక్కుబడిగా నోటీసులు జారీ చేసి, తమ బాధ్యత తీరిపోయిందన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారు. నోటీసులు అందుకున్న నిర్మాణదారులు ఏమాత్రం భయం లేకుండా పనులను వేగవంతం చేస్తుంటే, టౌన్ ప్లానింగ్ విభాగం ఏ చర్యలు తీసుకోకపోవడం వెనుక పెద్ద ఎత్తున లోపాయికారీ ఒప్పందాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆకాశమే హద్దుగా అంతస్తులు పెరుగుతున్నా, అధికారులు మాత్రం కార్యాలయాల్లోని తమ కుర్చీలకే పరిమితం కావడం ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది.జిల్లా కలెక్టర్ అక్రమ నిర్మాణాల విషయంలో కఠినంగా ఉండాలని, ఎక్కడికక్కడ కూల్చివేతలు చేపట్టాలని ఆదేశించినా, ఇంద్రేశంలో మాత్రం ఆ ఆదేశాలు బుట్ట దాఖలవుతున్నాయి.జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణ లోపించడం వల్లే స్థానిక మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనకు రావడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పత్రికల్లో వరుస కథనాలు వస్తున్నా, సోషల్ మీడియాలో నిరసనలు వ్యక్తమవుతున్నా అధికారుల్లో చలనం రాకపోవడం గమనార్హం. కేవలం కార్యాలయాలకే పరిమితమై, కాగితాలపై నివేదికలు సిద్ధం చేస్తూ కాలక్షేపం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతూ, నిబంధనలను తుంగలో తొక్కుతున్న ఈ అక్రమ నిర్మాణాల వెనుక రాజకీయ అండదండలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అధికారుల నిర్లక్ష్యం వల్ల భవిష్యత్తులో ఇంద్రేశం ప్రాంతం ట్రాఫిక్ సమస్యలతో, ఇరుకైన సందులతో ఒక మురికివాడగా మారే ప్రమాదం ఉందని పట్టణ ప్రణాళిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు అక్రమ కట్టడాలను వెంటనే నేలమట్టం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో అక్రమ నిర్మాణాల జోరు ఇలాగే కొనసాగితే, సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతినే అవకాశం ఉంది.

# సన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూరాలజీ ప్రారంభం





కొత్తపేట, 4 మే (నగర నిజం) : కొత్తపేట డివిజన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో నూతనంగా ప్రారంభమైన సన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూరాలజీ వైద్య సంస్థ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎల్.బి.నగర్ శాసనసభ్యుడు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ స్థాయి యూరాలజీ, నెఫ్రాలజీ వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో ఈ సంస్థను ప్రారంభించడం అభినందనీయమని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమని పేర్కొన్నారు.యూరాలజీ, కిడ్నీ సంబంధిత చికిత్సలు ఒకే వేదికపై ఆధునిక సదుపాయాలతో అందించబడటం ప్రాంత ప్రజలకు ఉపయోగకరమని అన్నారు. వైద్య రంగంలో ఇటువంటి ప్రత్యేక సంస్థలు పెరగడం సమాజ ఆరోగ్యాభివృద్ధికి దోహదపడుతుందని వెల్లడించారు.ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకుడు సూర్య ప్రకాష్ వైద్య బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, భారస నాయకుడు మహేష్ రెడ్డి, ఇతర నాయకులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# భవ్యంగా ప్రారంభమైన సాహెబ్‌నగర్ శ్రీ త్రినేత్ర ఆంజనేయ స్వామి జాతర ఉత్సవాలు



సాహెబ్ నగర్, 3 మే (నగర నిజం) : సాహెబ్ నగర్ లోని శ్రీ త్రినేత్ర ఆంజనేయ స్వామి దేవస్థానం జాతర ఉత్సవాలు భక్తుల సందోహంలో భవ్యంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణం మొత్తం పుష్పాలతో అలంకరించగా, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో భక్తి గీతాలు, సంప్రదాయ కార్యక్రమాలు కొనసాగాయి. భక్తుల కోసం అన్నదానం ఏర్పాటు చేశారు.స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు ఉత్సవాల్లో పాల్గొని ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, శానిటేషన్, రవాణా సౌకర్యాలు కల్పించారు.జాతర సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి రద్దీని నియంత్రించారు.ఈ జాతర ఉత్సవాలు కొన్ని రోజుల పాటు కొనసాగనున్నాయి.




Edited & printed and owner,publisher Yela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed Y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor Yela purushotham.(H.O) : plot no:31,H-No 1-13,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.(PRGI) .PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE